## క్లుప్తంగా

### సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



మిడ్జిల్: మండలంలోని బైరంపల్లిలో ఎన్‌ఆర్‌ ఈజీఎస్‌ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణపనులను గురువారం జడ్చర్ల మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ జ్యోతి అల్వాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సహకారంతో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, అండర్‌ డ్రెయినేజీ నిర్మాణాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో మాజీ ఎంపీటీసీలు గౌస్‌, రాజారెడ్డి, శివప్రసాద్‌, నాయకులు జంగయ్య, యాదగిరి, బాలిశ్వర్‌ పాల్గొన్నారు.

### దోనూర్‌, వస్పులలో టీబీ వైద్యశిబిరం



మిడ్జిల్: మండలంలోని దోనూర్‌, వస్పుల గ్రామాల్లో గురువారం టీబీ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు వైద్యాధికారి శివకాంత్‌ తెలిపారు. దాదాపు వంద మంది అనుమానితుల నుంచి శాంపిల్స్‌ను సేకరించామన్నారు. ఈశిబిరంలో డాక్టర్లు సౌజన్య, యాకూబ్‌, సూపర్‌వైజర్‌ ప్రసాద్‌, దేవయ్య, సంపత్‌ కుమార్‌, పారిజాత, శోభ, శిరీష, బాలమణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### సంఘీభావ సభను విజయవంతం చేయాలి




మిడ్జిల్: ఎస్సీ వర్గీకరణ కోసం ఈనెల 11 (శనివారం)న హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆడిటోరియంలో నిర్వహించనున్న మేధావుల సంఘీభావ సభ విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగ ఫెడరేషన్‌ రాష్ట్ర కార్యదర్శి యాదయ్య కోరారు. గురువారం ఆసభ కరపత్రాలను స్థానిక అంబేడ్కర్‌ భవన్‌ వద్ద విడుదల చేశారు. ఈసభకు రాష్ట్ర నలుమూలల నుంచి మాదిగ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు విజయ్‌కుమార్‌, సంపత్‌, జానకమ్మ, రవికుమార్‌, దానేలు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పథంలో గిరిజన యువత



నవాబుపేట: గిరిజన యువత చైతన్యవంతులై అభివృద్ధిలో దూసుకుపోతున్నారని ఎస్‌ఐ విక్రమ్‌ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గిరిజన నాయకుడు భాస్కర్‌నాయక్‌ ఆధ్వర్యంలోని నిర్వహిస్తున్న లక్ష్మణ్‌నాయక్‌ స్మారక క్రికెట్‌ టోర్నీ పోస్టర్‌ను ఆయన ప్రారంభించారు. యువత విద్య, ఉపాధి రంగాల్లో మరింత ముందుకు పోతూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుండటం గొప్ప విషయం అన్నారు. ప్రశాంత వాతావరణంలో క్రీడలు నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌ వైస్‌ చైర్మన్‌ తులసిరాంనాయక్‌, కాంగ్రెస్‌ పార్టీ మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య, భాస్కర్‌నాయక్‌, వెంకటేష్‌గౌడ్‌, సంతోష్‌, నారాయణ, శంకర్‌, తులసిరాం తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



అడ్డాకుల: మూసాపేట మండలం దాసర్‌పల్లిలో శ్రీమహాత్మా బాలక్రిష్ణ బ్రహ్మేంద్ర యోగీశ్వర స్వామి ఆశ్రమంలో గురువారం వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త దేవుడి మిధున్‌కుమార్‌ ఆధ్వర్యంలో వాస్తు జ్యోతిష్య పండితులు మహాగౌరి ఉపాసకులు దింటకుర్తి మురళీకృష్ణ, అన్నప్రసాదం ఫౌండేషన్‌ చైర్మన్‌ సంధ్య వృద్ధులకు దుప్పట్లను అందజేశారు.

# నిండిన డ్రెయినేజీ

- ముందుకు కదలని మురుగు
- మట్టి పడి మూసుకుపోయిన కాల్వ
- నెలరోజుల వ్యవధిలో ఇది మూడోసారి

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: స్థానిక పాత పాలమూరులోని కొత్త బ్రిడ్జికి సమీపంలో మెయిన్‌ రోడ్డు పక్కన ఉన్న డ్రెయినేజీ నిండిపోయింది. కొద్దిదూరం చిన్నపైపు మొత్తం మట్టిలో కూరుకుపోవడంతో మురుగు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. ఒకవేళ రోడ్డుపైకి వస్తే బురదగా మారి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందని వాహనదారులు, పాదాచారులు వాపోతున్నారు. ఇలా జరగడం నెల రోజుల్లో ఇది మూడోసారి అని స్థానికులు చెబుతున్నారు. ఆపక్కనే షెట్టర్‌ గ్రిల్స్‌ తయారుచేసే కార్ఖానాలు వెలిశాయి. వాటి నిర్వాహకులు ఈపెద్దమోరీలో కర్రలతో కదిపినా మురుగు ముందుకు వెళ్లడం లేదు. ఈవిషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ రవీందర్‌రెడ్డిని వివరణ కోరగా వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి మురుగు ముందుకు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.



పాతపాలమూరు కొత్త బ్రిడ్జికి సమీపంలో డ్రెయినేజీ నిండి ముందుకు కదలని మురుగు

# మౌనేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



కమ్యూనిటీ హాలును పరిశీలిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ ఆనంద్‌ కుమార్‌గౌడ్‌ తదితరులు

- అసంపూర్తి ఉన్న కమ్యూనిటీ హాలును పరిశీలించిన మున్సిపల్‌ చైర్మన్‌

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: స్థానిక మోనప్పగుట్ట ప్రాంతంలోని మౌనేశ్వరస్వామి ఆలయంలో గురువారం మున్సిపల్‌ చైర్మన్‌ ఎ.ఆనంద్‌ కుమార్‌గౌడ్‌ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న విశ్వబ్రాహ్మణ (స్వర్ణకార) సంఘం కమ్యూనిటీ హాలును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భవనానికి ఇటీవలే రూ.పది లక్షలు కేటాయించామన్నారు. పనులను పునఃప్రారంభించి త్వరగా పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకుడు ప్రశాంత్‌ కుమార్‌, సంఘం నాయకులు రమేష్‌చారి, శేఖర్‌చారి, కిరణ్‌, రవి తదితరులు పాల్గొన్నారు.

# నియోజవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొల్లూర్‌లో కొల్లూర్‌ ప్రీమియర్‌ లీగ్‌ క్రికెట్‌ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై దృష్టిసారించి ముందుకుపోతున్నానని, దీనికి నియోజకవర్గ ప్రజలు తనకు ఇచ్చిన గొప్పఅవకాశమని ఆయన వివరించారు. తిరుమలలో తెలంగాణ ప్రజా ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యను తాను గళమెత్తి పరిష్కరించేలా చేశానని తెలిపారు. కొద్దిసేపు క్రీడాకారులతో క్రికెట్‌ ఆడి అందరిని ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ లింగం, కాంగ్రెస్‌ పార్టీ మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య, వెంకటేష్‌గౌడ్‌, భూపాల్‌రెడ్డి, వాసుయాదవ్‌, రామకృష్ణ, రాజు, రఘు, ఖాజా, రాజేష్‌, వెంకటేష్‌, రమే ష్‌గౌడ్‌, శ్రీహరి తదితరులు ఉన్నారు.

**యూటీఎఫ్‌ క్యాలెండర్‌ ఆవిష్కరణ**

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ క్యాలెండర్‌ను గురువారం స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌ రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటంలో ఉపాధ్యాయులు తమవంతు బాధ్యతను పోషించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఈఓ శ్రీనివాసులు, యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు రవికుమార్‌, ప్రధానకార్యదర్శి వెంకటేశ్‌, ఉపాధ్యక్షులు నర్సింహులు, కార్యదర్శులు మన్యం, అజయ్‌, సుదర్శన్‌, రాము, ప్రభావతి, మండల అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి నరేష్‌ పాల్గొన్నారు.



కొల్లూర్‌లో క్రికెట్‌ ఆడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

# ఆలయాలు ముస్తాబు

- ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు
- విద్యుద్దీపాలతో అలంకరణ
- నేడు వైకుంఠ ఏకాదశి

జడ్చర్ల టౌన్‌: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని జడ్చర్లలోని వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 6గంటల నుంచి ప్రత్యేక పూజలతోపాటు ఉత్తర ద్వార దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున 4గంటలకు స్వామికి పంచామృతాభిషేకం, అలంకరణ జరిపించి భక్తులకు ఉత్తర ద్వారదర్శనం కల్పించనున్నారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల తాకిడిని తట్టుకునేందుకు బారికేడ్లు ఏర్పాటుచేశారు.



జడ్చర్లలో ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

దేవరకద్ర: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఆలయాలను ముస్తాబు చేశారు. మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి దేవాలయం ఉత్తరద్వారాన్ని భక్తుల ప్రవేశం కోసం సిద్ధంచేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంను వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లుచేశారు. శుక్రవారం ఉదయం 6గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఉత్తరద్వారం ద్వారా భక్తులు ప్రవేశించడానికి ఏర్పాట్లు చేశారు.

# ఎన్నాళ్లీ ఎదురుచూపులు





ఊరంచుతండాలోని పంచాయతీ భవనం

- మాజీ సర్పంచ్‌లకు బకాయిల భయం
- పంచాయతీలకు అందని బిల్లులు

నవాబుపేట: పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు ఎదురుచూపులు చూస్తున్నారు. పదవీకాలం ముగిసిన తర్వాత కూడా బకాయిలు ఇంకారాలేదు. దీంతో తమ బాధను పట్టించుకునే వారే లేరని మదనపడుతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సర్పంచ్‌లకు బకాయిల భయం పట్టుకుంది. పల్లెప్రగతితో గ్రామాల్లో అభివృద్ధి పనులను పోటీపడి పూర్తిచేసిన సర్పంచ్‌లకు తాజాగా మాజీలుగా మారిన కూడ బిల్లులు రాలేదు. మండలంలో మొత్తం 54 పంచాయతీల్లో పంచాయతీరాజ్‌ శాఖ ద్వారా 24 గ్రామాలు, ఉపాధి పథకంలో 30 గ్రామాల్లో పనులు చేపట్టారు. ఇలా గ్రామాల్లో చేసిన పనులకు సర్పంచ్‌లకు దాదాపుగా రూ.10 కోట్ల రూపాయల పైవరకు బిల్లులు బకాయి ఉంది. ఈ విషయంలో ఎప్పుడు అధికారులను అడిగినా దాట వేస్తున్నారే తప్ప బిల్లులు మాత్రం చెల్లించటం లేదని మాజీ సర్పంచ్‌లు వాపోతున్నారు. సమాధానం దాటవేస్తున్నారు తప్ప బిల్లులుచెల్లించటం లేదని తాజా మాజీ సర్పంచ్‌లు వాపోతున్నారు.

**అధికారులకు వివరిస్తాం**

గతంలో ఉన్న సర్పంచ్‌లు చేసిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. చాలా గ్రామాల తాజా మాజీలు బిల్లుల కోసం రోజు ఆరాతీస్తున్నారు. బిల్లుల విషయం జిల్లా అధికారులకు వివరిస్తాం. తాజా ప్రభుత్వం నిధులు విడదల చేస్తే వాటిని పని చేసినవారికి అందిస్తాం. గ్రామాలవారీగా ఉన్న బకాయిలపై ఆరాతీసి నివేదిక తయారు చేస్తాం.

జయరాంనాయక్‌, ఎంపీడీఓ, నవాబుపేట

**రూ.25లక్షలు రావాల్సి ఉంది**



గ్రామంలో చేపట్టిన పనులకు సంబంధించి ఇప్పటికే రూ.25 లక్షలు రావాల్సి ఉంది. పనులు చేసి రెండేళ్లు గడుస్తున్నా అధికారులు స్పందించడం లేదు. ప్రభుత్వం మారటంతో తమ పరిస్థితి మరింత ఆగమ్యగోచరంగా మారింది. బిల్లులు వస్తాయా లేదా అనే సందేహం ఏర్పడింది.

సత్యం, మాజీసర్పంచ్‌, లోకిరేవు

**అధికారుల చుట్టూ తిరుగుతున్నాం**



తాము అధికారంలో ఉన్నప్పటి నుంచి నిత్యం బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. తాము చేసిన అప్పులకు ఒత్తిడి ఎక్కువైంది. గ్రామం కోసం లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చాం పోటి పడి పనులు పూర్తిచేశాం. తీరా పనులకు సంబంధించి బిల్లులు రాలేదు.

గోపాల్‌గౌడ్‌, మాజీ సర్పంచ్‌, నవాబుపేట

# వేధిస్తే ఫిర్యాదు చేయండి

- డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్‌ క్రైం: ఈవ్‌ టీజింగ్‌, సోషల్‌ మీడియా ద్వారా అమ్మాయిలు, విద్యార్థినులు ఇబ్బందులు పడితే డయల్‌ 100 లేదా షీటీం 8712659365నంబర్లకు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని పంచవటి పాఠశాలలో గురువారం షీటీం పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు రక్షణకోసం ఇటీవల భరోసా సెంటర్‌ కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని, ఇక్కడ బాధితులకు ఒకేచోట అన్నిసేవలు ఉంటాయని తెలిపారు. భరోసా సెంటర్‌లో ఫిర్యాదు చేయడానికి 8712659280కు ఫోన్‌ చేయాలన్నారు. అవసరం అయిన బాధితులకు తాత్కాలిక ఆశ్రయం కల్పించడంతోపాటు వైద్యపరీక్షలు, చికిత్స, కౌన్సిలింగ్‌ అన్నిసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. రూరల్‌సీఐ గాంధీనాయక్‌, ఎస్‌ఐ సుజాత, షీటీం పోలీస్‌ సిబ్బంది వనజరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

### నేడు ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయం ముట్టడి

మహబూబ్‌నగర్‌ న్యూటౌన్‌: తెలంగాణ హెల్త్‌ కమ్యూనిటీ ఆశా వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర క మిటీ పిలుపుమేరకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయం ముట్టడిని నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న ఆశావర్కర్లకు పారితోషికాల పేరుతో వారి శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆశా కార్మికులకు సీఐటీయూ మద్దతు తెలుపుతుందన్నారు. మహబూబ్‌నగర్‌, దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాల్లోని ఆశాకార్యకర్తలు పెద్దఎత్తున ఈనిరసనలో పాల్గొని తమ డిమాండ్ల పరిష్కారానికి ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

### రేపు గిరి ప్రదక్షిణ

దేవరకద్ర: జిల్లాలో ప్రసిద్ధి చెందిన కురుమూర్తి దేవస్థానంలో శనివారం ఉదయం జరిగే గిరిప్రదక్షిణను విజయవంతం చేయాలని కొత్తకోట శివానందస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరి ప్రదక్షిణలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

### యువకుడిపై కేసు నమోదు

మహబూబ్‌నగర్‌ క్రైం: బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ యువకుడిని షీ టీం పోలీసులు అదుపులోకి తీసుకుని టూ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. టూటౌన్‌ సీఐ ఇజాజుద్దీన్‌ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం సాయంత్రం ఓ యువకుడు బస్సు ఎక్కుతున్న మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ.. పలు చోట్ల తాకడం చేస్తుంటే బస్సులో ఉన్న ఓ యువతి షీ టీంకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో బస్టాండ్‌కు చేరుకున్న షీ టీం బృందం యు వకుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో అప్పగించారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### కందుల ధర రూ. 7372

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్‌ యార్డులో గురువారం జరిగిన ఈటెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 7372, కనిష్ఠంగా రూ. 6959గా ధరలు లభించాయి. ఆర్‌ఎన్‌ఆర్‌ ధాన్యం ధర గరిష్ఠంగా రూ. 2629, కనిష్ఠంగా రూ. 2409 గా ధరలు నమోదు అయ్యాయి.

### బీసీలు సత్తా చాటాలి

జడ్చర్ల టౌన్‌: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్‌ స్థానాల్లోనూ బీసీలు సత్తాచాటాలని అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్‌ పిలుపునిచ్చారు. గురువారం మండలకేంద్రంలో నిర్వహించిన బీసీ జాగృతిసేన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా దామాషా పద్ధతిన బీసీలకు సీట్లు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రిజర్వేషన్ల కేటాయింపులో కోత విధిస్తే అధికార పార్టీకి తగిన గుణపాఠం నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. ఒకవేళ రిజర్వేషన్లలో ఏదైనా అన్యాయం జరిగినా జనరల్‌ స్థానాల్లోనైనా పోటీ చేసి గెలవాలన్నారు. జాగృతిసేన మండల ప్రధానకార్యదర్శి నర్సింహులు, నాయకులు సురభివిజయ్‌కుమార్‌, లింగంపేట శేఖర్‌, కుర్వగడ్డపల్లి గోపాల్‌, శివరాములు పాల్గొన్నారు.

### స్పోకెన్‌ ట్యుటోరియల్‌పై అవగాహన సదస్సు

జడ్చర్ల టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల టీఎస్‌కేసీ విభాగం ఆధ్వర్యంలో ఐఐటీ ముంబై వారి సౌజన్యంతో గురువారం తృతీయ ఏడాది విద్యార్థులకు స్పోకెన్‌ ట్యుటోరియల్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్‌ డా. సుకన్య మాట్లాడుతూ నేటి సమాజంలో సాధారణ డిగ్రీ కోర్సులతోపాటు అదనంగా సాధించే సర్టిఫికెట్‌ కోర్సుల ద్వారా మరింత జ్ఞానార్జన జరుగుతుందని అన్నారు. ఆన్‌లైన్‌ ద్వారా ఇంటివద్ద నుంచే సర్టిఫికెట్‌ కోర్సులు చేయవచ్చన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారానే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందని, ప్రతిఒక్కరూ చదువుపై శ్రద్ధ వహించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్‌ నాగలక్ష్మితోపాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి




చిన్నచింతకుంట: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ ఆర్‌ శేఖర్‌ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని జూనియర్‌ కళాశాలలో విద్యార్థులకు, గ్రామస్తులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలను నడపరాదని అన్నారు. హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రసన్నరాణి పాల్గొన్నారు.

### బీజేవైఎం ఆందోళన

జడ్చర్ల టౌన్‌: హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిఘటనను నిరసిస్తూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్‌లో చౌరస్తాలో కాంగ్రెస్‌ పార్టీ దిష్టిబొమ్మను బీజేవైఎం నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాన్ని పోలీసులు, బీజేవైఎం నాయకులకు మధ్య కొంత వాగ్వాదం తోపులాటకు దారితీసింది. బీజేపి, బీజేవైఎం నాయకులు పోలీసుల తీరుపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రశ్నించే వాడిని నొక్కిపడేస్తున్నారని ఆరోపించారు. బీజేవైఎం, బీజేపీ నాయకులు శ్రీనాథ్‌, నరేష్‌, బాలవర్ధన్‌గౌడ్‌, రమేష్‌జి పాల్గొన్నారు.

## శబరిమలకు తరలివెళ్లిన అయ్యప్ప మాలధారులు



శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

హన్వాడ: మండలంలోని టంకర గ్రామంలో అయ్యప్ప మాలధారులు శబరిమలకు తరలివెళ్లారు. మండల దీక్ష చేపట్టిన మాలధారులు ఇరుముడి కట్టుకుని గురువారం శబరిమలకు బయలుదేరారు. ఈసందర్భంగా గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి, అయ్యప్ప స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు కృష్ణయ్యయాదవ్‌, వెంకటేష్‌ గురుస్వామితో పాటు 30మంది అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు అందజేత

మిడ్జిల్: మండలంలోని ఈదులబావితండాలో సీఎంఆర్‌ఎఫ్‌ (ముఖ్యమంత్రి సహాయనిధి) నుంచి మంజూరైన చెక్కులను కాంగ్రెస్‌ పార్టీ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్‌ భాస్కర్‌నాయక్‌ మాట్లాడుతూ తండాలో ఆస్పత్రికి వెళ్లిన లలిత, పద్మకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు వచ్చినట్లు తెలిపారు. ఆపద లో ఉన్నవారికి సీఎం సహాయ నిధితో మేలుచేస్తోందన్నారు. నాయకులు నాన్‌నాయక్‌, ధర్మ, రమేష్‌, పీకే నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.



# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

నారాయణపేట రూరల్‌: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి విమర్శించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఆశచూపి మోసం చేసిందన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పి ఒక ఏడాది రైతు భరోసా ఎగ్గొట్టి ఇప్పుడు ఎకరాకు రూ.12వేలు మాత్రమే ఇస్తామని మోసంచేసిందని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చునని అన్నారు.

## బీజేపీ మండలాధ్యక్షుల నియామకం

పాలమూరు: సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బీజేపీ పార్టీ రాష్ట్ర హైకమాండ్‌ ఆదేశాల మేరకు జిల్లాలో 12మండలాలకు సంబంధించిన నూతన అధ్యక్షులతో పాటు ఆరుగురు కౌన్సిల్‌ సభ్యులను నియామిస్తూ బీజేపీ రాష్ట్ర సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌ గురువారం ధ్రువీకరణ పత్రాలను అందించారు. జిల్లా ఎన్నికల సహా అధికారులుగా పాండురంగా రెడ్డి, రాజేష్‌ను ప్రకటించారు. నూతనంగా నియామకం చేసిన 12మంది మండల అధ్యక్షులు, ఆరుగురు కౌన్సిల్‌ సభ్యులు పార్టీ నియమావళి ప్రకారం సంస్థాగతంగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, రాబోమే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు కృషిచేయాలన్నారు.

**మిడ్జిల్‌కు నరేష్‌నాయక్‌**

మిడ్జిల్: బీజేపీ మండలాధ్యక్షుడిగా నరేష్‌నాయక్‌ను, జిల్లా కౌన్సిల్‌ మెంబర్‌గా వెంకటేశ్వర్‌రెడ్డిని గురువారం నియమించినట్లు ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్‌ తెలిపారు. పార్టీ ప్రతిష్ట కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు.

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాలనూతన అధ్యక్షులను ఎంపిక చేశారు అడ్డాకులకి జీకే.రమేష్‌, మూసాపేటకి వేములకి చెందిన టీకే. నర్సింహను ఎంపిక చేస్తూ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌ కుమార్‌ ప్రకటన విడుదల చేశారు.